సాక్షి
అనంతపురం
గురువారం । 4 । మే । 2023



చీనీ టన్ను రూ.37 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



టమాట కిలో రూ.5
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5, కనిష్టంగా రూ.3, సరాసరి రూ.4 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.9°/22.7°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

50 శాతం రాయితీపై జనుము, పిల్లిపెసర విత్తనాలు



జనుము విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: పచ్చిరొట్ట ఎరువుల (గ్రీన్‌మెన్యూర్) విత్తనాలపై రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ వర్తింపజేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ సీడ్స్ ద్వారా వీటిని రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాకు 200 క్వింటాళ్ల వరకు జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కేటాయించారు. జీలుగ విత్తనాల ధరలు ఇంకా ఖరారు చేయలేదు. జనుము క్వింటా పూర్తి ధర రూ.8,400 కాగా 50 శాతం రాయితీపై రైతుకు రూ.4,200 ప్రకారం పంపిణీ చేయనున్నారు. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.9,700 కాగా అందులో 50 శాతం రాయితీ పోనూ రైతుకు రూ.4,850 ప్రకారం ఇవ్వనున్నారు. జనుము 10 కిలోల ప్యాకెట్లలోనూ, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ రూపంలో ప్యాకింగ్ ఉంటుందన్నారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ప్యాకెట్లు పంపిణీ చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఆర్‌బీకేల్లో డి-కృషి యాప్‌లో తమ వాటా చెల్లింపుతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వీటిని పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్, ఏపీ సీడ్స్ డీఎం జె.ధనలక్ష్మి తెలిపారు.

మంత్రి విడదల రజని రేపు రాక



అనంతపురం అర్బన్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఈ నెల 5న అనంతపురం విచ్చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆస్పత్రిలో అన్ని విభాగాలనూ సందర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వైద్య కళాశాల ప్రొఫెసర్లు, విభాగాల అధిపతులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు భోజన విరామం తీసుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి రోడ్డు మార్గంలో బెంగళూరుకు వెళతారు.

పంటనష్టం రూ.5.50 కోట్లు



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల ఈదురు గాలులు, అకాల వర్షాలకు జరిగిన పంట నష్టం రూ.5.50 కోట్లకు చేరింది. అందులో బుక్కరాయసముద్రం, బెళుగుప్ప, గార్లదిన్నె, గుత్తి, గుమ్మఘట్ట, గుంతకల్లు, కూడేరు, పామిడి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, రాప్తాడు, శింగనమల, యాడికి, యల్లనూరు మండలాల్లో అరటి, నిమ్మ, చీనీ, మామిడి, బొప్పాయి, టమాట, బెండ, ఆకు, మునగ తదితర ఉద్యాన తోటలు 110 హెక్టార్లలో దెబ్బతినడంతో 111 మంది రైతులకు రూ.1.35 కోట్ల వరకు పంటనష్టం జరిగినట్లు ఆ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. ఇక గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, గుమ్మగట్ట, శింగనమల, అనంతపురం, బ్రహ్మసముద్రం, శెట్టూరు, పామిడి తదితర మండలాల్లో 660 హెక్టార్లలో వరి, వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, కొర్ర తదితర పంటలు దెబ్బతినడంతో రూ.4.15 కోట్ల వరకు నష్టం జరిగినట్లు ఆ శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేశారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి మరో నోటిఫికేషన్ !



అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ పోస్టుల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులు ఖాళీ ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నారు. గత నెలలో నోటిఫికేషన్, భర్తీ ప్రక్రియ పూర్తయింది. తాజాగా మరో నోటిఫికేషన్‌కు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో ఏర్పడిన ఖాళీలను గుర్తించడం, రోస్టర్ తయారు చేయడంలో ఐసీడీఎస్ అధికారులు నిమగ్నమయ్యారు. రెండు, మూడురోజుల్లో తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

రమణీయం.. రథోత్సవం



రథంపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

- లక్ష్మీచెన్నకేశవ గోవిందా.. గోవింద!

ధర్మవరం అర్బన్: గోవిందనామ స్మరణతో ధర్మవరం మార్మోగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో తేరుబజార్ పోటెత్తింది. లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ రోజు బుధవారం బ్రహ్మరథోత్సవం కమనీయంగా సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకుని తరించారు.

మడుగుతేరుతో ప్రారంభం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గజ వాహనంపై పురవీధులలో ఊరేగింపుగా తేరుబజార్‌కు తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపైన స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. ఉదయం 7 గంటలకు మడుగుతేరు నిర్వహించగా, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు పూజలు చేసి తేరు లాగారు. అనంతరం వేలాది మంది భక్తులు రథం వద్దకు చేరుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కిటకిటలాడిన ధర్మవరం

సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం ప్రారంభం కాగా, ఈ కమనీయ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో పట్టణం భక్తులతో కిటకిటలాడింది. తేరుబజార్ నుంచి ప్రారంభమైన రథోత్సవం భక్తుల గోవిందనామ స్మరణల మధ్య అంజుమన్ సర్కిల్ వరకు సాగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రథాన్ని లాగుతూ భక్తుల్లో ఉత్సాహం నింపారు. సీఐలు సుబ్రహ్మణ్యం, రాజా ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు ధూళోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం, ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

ఫార్మా డీ, ఎంబీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలో నిర్వహించిన ఫార్మా డీ నాలుగు, ఐదో సంవత్సరం (ఆర్-17) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ రెండు, నాలుగో సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

6న ట్రాక్టర్ నగర్‌లో కృషి దర్శన్ ఎక్స్‌పో

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)లో ఈ నెల ఆరో తేదీన కృషి దర్శన్ ఎక్స్‌పో - 2023 నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డైరెక్టర్ కమలాబాయి పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా 'కృషి దర్శన్' కార్యక్రమం ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి తయారు చేసిన ఆధునిక యంత్రాలు, పరికరాలను, చిరుధాన్యాలు ప్రాసెసింగ్ చేసే యంత్రాలను ప్రదర్శిస్తారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రదర్శనకు వచ్చే రైతులకు ఉచిత రవాణా సౌకర్యం, భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.



పుస్తకాలు పట్టుకుని కాలేజీకి వెళ్లాల్సిన వయసులో పుస్తెలు కట్టించుకుంటున్న పరిస్థితి. ఉన్నత చదువులు పూర్తి చేసి కెరీర్‌లో స్థిరపడదామనుకున్న వేళ అమ్మాయిలను ఇల్లాలుగా మారుస్తున్నారు. తల్లిదండ్రులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో వేలాదిమంది అమ్మాయిలు బాల్యవివాహాల బందీఖానాలో ఇరుక్కుపోతున్నారు. పద్దెనిమిదేళ్లలోపే పెళ్లి, తల్లి కావడం రెండూ జరిగిపోతుండటం అమ్మాయిల జీవితాల్లో చేదు అనుభవంగా మిగిలిపోతోంది.

ముళ్ల బాట

- బాల్య వివాహాలతో అనర్థాలు
- స్మార్ట్‌ఫోన్లతోనే ఎక్కువగా పెడదోవ
- తప్పటడుగు వేస్తారేమోనని తల్లిదండ్రుల ఆందోళన
- పెళ్లీడు రాకనే అత్తారింటికి పంపించేస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: బాల్య వివాహాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. అధికారుల దృష్టికి సమాచారం రాగానే నేరుగా వెళ్లి బాల్య వివాహాలను ఆపేస్తున్నారు. అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు, బంధువులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. జిల్లాలో ఏడాదికి సగటున 400పైనే బాల్య వివాహాలు అడ్డుకుంటున్నారు. గడిచిన ఐదేళ్లలో 2,218 బాల్య వివాహాలను సకాలంలో నిలిపేశారు. అధికారుల దృష్టికి రాకుండానే బాల్య వివాహాలు జరుగుతున్నవి ఎన్నో ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతం, గ్రామీణ ప్రాంత పరిధి, వలస వచ్చిన వారు ఎక్కువగా ఉండటం.. తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంతో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్టు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. అమ్మాయిలకు వివాహం అయిపోతే భారం తగ్గుతుందన్న భావనలోనూ ఎక్కువమంది తల్లిదండ్రులున్నారు. చదువుల కంటే ఎక్కువగా వివాహాల వైపే మొగ్గుచూపుతున్నారు. తాజా పోకడలు కూడా భయాందోళన కలిగిస్తున్నాయి. అమ్మాయిలు స్మార్ట్ ఫోన్‌ల ద్వారా రిలేషన్‌షిప్స్ పెంచుకుంటుండటంతో తల్లిదండ్రుల్లో అభద్రతా భావం నెలకొని 'ముందస్తు పెళ్లి' నిర్ణయం తీసుకుంటున్నారు.

- 21 సంవత్సరాల లోపు అబ్బాయికి, 18 ఏళ్ల లోపు అమ్మాయికి పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరం. కానీ ఈ చట్టాలు, శిక్షలపై అవగాహన లేక 15 ఏళ్ల వయసులోనే పెళ్లి చేస్తున్నారు.
- బాల్యవివాహాలకు సహకరించిన తల్లిదండ్రులకు 2 ఏళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా.
- బాలికను వివాహం చేసుకుంటే వరుడితో పాటు అతని తలిదండ్రులకు పోక్సో చట్ట ప్రకారం శిక్ష పడుతుంది.
- పోక్సో చట్టం సెక్షన్ 4 (ఐ) ప్రకారం పెళ్లికుమారుడికి 10 ఏళ్లకు తక్కువ కాకుండా శిక్ష.

గత ఐదేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అధికారులు ఆపేసిన బాల్యవివాహాలు

సంవత్సరం	ఆపేసిన బాల్యవివాహాలు
2018-2019	450
2019-2020	430
2020-2021	460
2021-2022	418
2022-2023	460

- 16 ఏళ్ల లోపు బాలికను వివాహం చేసుకుంటే అత్యాచారం కేసుగా పరిగణించి 20 ఏళ్ల జైలు శిక్ష వేస్తారు.
- బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే 1098, 181 లేదా 100కు కాల్ చేస్తే వెంటనే ఆ వివాహం జరగకుండా అధికారులు ఆపేస్తారు.

తల్లిదండ్రుల్లో అవగాహన రావాలి

అబ్బాయిల కంటే అమ్మాయిలు అన్నింటా రాణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వాళ్లకు పెళ్లి చేయగానే భారం తగ్గుతుందని తల్లిదండ్రులు భావించకూడదు. ప్రతి ఊర్లోనూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాల్యవివాహాలు ఆరోగ్యరీత్యా కూడా అమ్మాయిలకు మంచిది కాదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి.
–శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

అభద్రతా భావంతోనే పెళ్లిళ్లు

తాజాగా సెల్‌ఫోన్‌కు బానిసలైన చాలామంది పిల్లలు సామాజిక మాధ్యమాల ద్వారానే పెడదోవ పడుతున్నారు. తల్లిదండ్రుల్లో అభద్రతా భావం మొదలై ఎక్కడ దారి తప్పుతారోనన్న భయంతో ముందే పెళ్లి చేస్తున్నారు. మాదగ్గరికి వస్తున్న చాలా కేసుల్లో ఇలాంటివే ఎక్కువ. స్మార్ట్‌ఫోన్‌ల ప్రభావం ఎక్కడికో దారితీస్తోంది.
–డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యులు

పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు, ఈఓ



భక్తుల నడుమ ఉత్సవ మూర్తుల ఊరేగింపు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం ధ్వజారోహణంతో అంకురార్పణ చేశారు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి, ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గరుడపటాన్ని ఉత్సవమూర్తుల సాక్షిగా ధ్వజస్తంభంపై శాస్త్రోక్తంగా ఎగురవేశారు. మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తిరుకల్యాణోత్సవం, బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు సకలదేవతలకు, ఇటు మానవజాతికి తెలిసేలా ధ్వజారోహణం ఘనంగా జరిపారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత నారసింహున్ని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు.

ముత్యాల సాగు.. బహు బాగు





ముత్యాలసాగులో భాగంగా ఆల్చిప్పలను నీటిలో వదులుతున్న రైతు రమేష్ (ఇన్‌సెట్) ఆల్చిప్ప

బుక్కరాయసముద్రం రైతు రమేష్ వినూత్నంగా ముత్యాల సాగుకు శ్రీకారం చుట్టాడు. తన వ్యవసాయ భూమిలో నీటి తొట్టి ఏర్పాటు చేసి అందులోకి భువనేశ్వర్ నుంచి తెప్పించిన దాదాపు ఐదు వేల ఆల్చిప్పలను వదిలాడు. ఆల్చిప్ప లోపలి పొరల్లో జరిగే రసాయన చర్యల వల్ల ముత్యం ఏర్పడుతుంది. దాదాపు రూ.2లక్షల పెట్టుబడి పెడితే ఏడాదిన్నర తర్వాత ముత్యాల ఉత్పత్తి ద్వారా రూ.5లక్షల దాకా ఆదాయం వస్తుందని రమేష్ 'సాక్షి'కి తెలిపాడు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

వజ్రకరూరు: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర, హౌసింగ్ పీడీ కేశవనాయుడుతో కలిసి కలెక్టర్ బుధవారం గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేశారు. వజ్రకరూరులోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ బోయ నాగలక్ష్మికి చెందిన నూతన ఇంటిని కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మిగిలిన లబ్ధిదారులు కూడా త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతుభరోసా కేంద్రంలో పప్పుశనగ కొనుగోళ్ల పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ హనుమప్ప, ఏఈ చెన్నారెడ్డి, ఎంపీపీ రమావత్ దేవి, వ్యవసాయ అధికారులు మధుకర్, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, సర్పంచ్ మోనాలిసా తదితరులు పాల్గొన్నారు

ప్రారంభోత్సవాలకు రెడీ చేయండి

గుంతకల్లుటౌన్: పేదలందరికీ ఇళ్లు పథకంలో మూడో ఆప్షన్ కింద లబ్ధిదారుల ఇళ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమి సూచించారు. బుధవారం ఆమె గుంతకల్లు పట్టణంలోని దోనిముక్కల రోడ్డు జగనన్న లేఅవుట్‌లో వివిధ దశల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పూర్తికి హౌసింగ్ సిబ్బంది, వార్డు ఎమినిటీ సెక్రెటరీలు ప్రత్యేక చొరవచూపాలన్నారు.



వజ్రకరూరు జగనన్న కాలనీలో నూతన గృహం లబ్ధిదారు నాగలక్ష్మి కుటుంబంతో కలెక్టర్ గౌతమి

అనంతరం కాలనీలో నిర్మించుకున్న ఓ ఇంటిని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కమిషనర్ బండిశేషన్న, హౌసింగ్ డీఈ రామకృష్ణారెడ్డి, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్ పాల్గొన్నారు.

వేగం పెంచాలి

గుత్తి: ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని లబ్ధిదారులు, హౌసింగ్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. గుత్తి పట్టణంలోని నేమతాబాద్ రోడ్డులో గల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్ బీ, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎండీఓ చిత్రా శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం

పామిడి: పామిడిలోని నాగిరెడ్డి కాలనీ పాఠశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న పనులను, గజరాంపల్లి సచివాలయాన్ని కలెక్టర్ గౌతమి బుధవారం తనిఖీ చేశారు. సచివాలయం చుట్టూ మురుగు నీటి నిల్వతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరాలో అలసత్వం ప్రదర్శించిన గజరాంపల్లి పంచాయతీ కార్యదర్శి నరేంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు ఇప్పించాలని పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులు ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంఈఓ జయానాయక్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

గుంతకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ నాడు-నేడు కింద ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. బుధవారం ఆమె గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి ప్రాంగణంలో రూ.13 కోట్లతో నిర్మిస్తున్న భవనాలతోపాటు బ్లడ్‌బ్యాంకు, ఆపరేషన్ థియేటర్, తదితర వాటిని తనిఖీ చేశారు. నూతన భవనం ఏర్పాటుతో పాటు పడకల సంఖ్య 80 నుంచి 125కు పెంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు కలెక్టర్ సూచన



అనంతపురం అర్బన్: రానున్న నాలుగైదు రోజుల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సూచించారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ 85002 92992 నంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి ప్రవాహాలకు దగ్గరగా ఉన్నప్పుడు, ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో పిడుగుపాటుకు అవకాశం ఉంటుందన్నారు. చెట్ల కింద, వాటి సమీపంలో, టవర్లు, చెరువులు దగ్గర ఉండరాదని సూచించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, మొబైల్ ఫోన్ ఉపయోగించరాదన్నారు. విద్యుత్ తీగలకు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలన్నారు. అలాంటప్పుడూ జాగ్రత్తలు తీసకోవాలని చెప్పారు.

సొమ్ము స్వాహాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా ఉద్యోగుల సహకార సంఘం (కో-ఆపరేటివ్ సొసైటీ)లో జరిగిన ఆర్థిక అవకతవకలపై కలెక్టర్ ఎం.గౌతమి విచారణకు ఆదేశించారు. 'సొసైటీ సభ్యుల సొమ్ము స్వాహా' శీర్షికన సోమవారం ప్రచురితమైన 'సాక్షి' కథనంపై కలెక్టర్ స్పందించారు. సమగ్ర విచారణ చేసి, నివేదిక అందించాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలాజీని ఆదేశించారు. సొసైటీ ఎన్నికల్లో మూడు యూనియన్లకు చెందిన వారు పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక వర్గంపై మరో వర్గం ఆరోపణలు, విమర్శలు చేస్తూ కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. సొసైటీలో ఆర్థిక అక్రమాలు వెలుగులోకి రావడం తపాలా ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణాధికారి ఐదేళ్లుగా జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అన్ని అంశాలపైనా విచారణ మొదలుపెట్టారు.

క్లుప్తంగా

37 మందికి ఉద్యోగావకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 37 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కాయి. ఈ మేరకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.అనిత తెలిపారు. చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థుల్లో తొలి రౌండ్‌లో 88 మంది ఉత్తీర్ణులు కాగా, బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 56 మంది హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 37 మందికి ఆకర్షణీయమైన ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులను కంపెనీ నిర్వాహకులు అందజేశారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులను ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎంవీ లక్ష్మయ్య, క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి, ఆర్ట్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

ఆకతాయికి దేహశుద్ధి



యువకుడికి దేహశుద్ధి చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: యువతిని వేధింపులకు గురి చేసిన ఆకతాయికి ప్రజలు దేహశుద్ధి చేశారు. వివరాలు... రాయదుర్గంలోని గొగ్గిరొట్టి ప్రాంతానికి చెందిన యువకుడు దాదాపీర్... కణేకల్లు రోడ్డులో మొబైల్ రిపేరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇదివరకే వివాహమైన దాదాపీర్.. ఓ ముస్లిం యువతి ఫోన్ నంబర్‌కు పలుమార్లు ఫోన్ చేసి, తనను పెళ్లి చేసుకోవాలని వేధించేవాడు. అంతటితో ఆగకుండా ఆ యువతి తనను ప్రేమిస్తోందని, పెళ్లి కూడా చేసుకుంటామంటూ తప్పుడు ప్రచారానికి తెరలేపాడు. ఈ విషయం కాస్త యువతి కుటుంబసభ్యులు, బంధువులకు తెలియడంతో బుధవారం రాత్రి దాదాపీర్‌ను నిలదీశారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న కాలనీ వాసులు దాదాపీర్ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

డిజీ లాకర్.. తగ్గిన వ్యయం

- జేఎన్‌టీయూ (ఏ)లో తొలిసారి డిజీ లాకర్‌లోకి జవాబు పత్రాలు
- విద్యార్థులకు అందుబాటులో డిజిటల్ మార్క్స్‌కార్డులు
- నేరుగా ప్రొవిజనల్ సర్టిఫికెట్ తీసుకునే వీలు
- ప్రతి సెమిస్టర్‌కు సర్టిఫికెట్ ప్రింటింగ్ వ్యయం ఆదా



జేఎన్‌టీయూ (ఏ)లోని పరీక్షల విభాగం

అనంతపురం: సుదూర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం జేఎన్‌టీయూ (ఏ) మెరుగైన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో డిజీ లాకర్‌లో సెమిస్టర్ మార్క్స్‌కార్డులు అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్లు ఎప్పుడైనా... ఎక్కడి నుంచైనా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో సెమిస్టర్ ప్రాతిపదికన హార్డ్ కాపీ ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండా పోయింది. దీంతో జేఎన్‌టీయూ (ఏ)కు ఏటా రూ.1.50 కోట్ల మేర ఆదా అవుతోంది.

సర్టిఫికెట్లకు భద్రత..

ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే డిజీ లాకర్ విధానంతో నిర్వహణ వ్యయం తగ్గడంతో పాటు సర్టిఫికెట్లకు భద్రత ఏర్పడింది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో మొత్తం 1.10 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్నారు. బీటెక్ కోర్సులో 8 సెమిస్టర్లకు సంబంధించి ప్రతి సెమిస్టర్‌కు సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సర్టిఫికెట్ల ప్రింటింగ్ ఖర్చు ఎక్కువగా ఉండేది. ఈ నేపథ్యంలో డిజీ లాకర్ విధానాన్ని వర్సిటీ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. తాజాగా సెమిస్టర్ సర్టిఫికెట్ హార్డ్‌కాపీ కాకుండా నేరుగా డిజిటల్ విధానంలోనే నేరుగా డిజీ లాకర్‌లో అందుబాటులోకి తెచ్చారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్ దరఖాస్తు సమయంలో డిజీ లాకర్‌లోని డిజిటల్ సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని అందజేస్తే చాలు. ఈ విధానం అత్యంత పకడ్బందీగా అమలవుతుండడంతో జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లాకర్‌లో 6.70 లక్షల సర్టిఫికెట్లు..

జేఎన్‌టీయూ (ఏ)లో డిజీ లాకర్ విధానం అమల్లోకి తెచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటి వరకూ మొత్తం 6.70 లక్షల సర్టిఫికెట్లను లాకర్‌లో ఉంచారు. దీంతో ఏడాదికి 6.70 లక్షల సర్టిఫికెట్ల ముద్రణకు అయ్యే ఖర్చు వర్సిటీకి ఆదా అవుతోంది. డిజీ లాకర్ విధానంతో ఎప్పటికప్పుడు సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశంతో పాటు తిరిగి అందులోనే భద్రపరచుకోవచ్చు. ఉద్యోగ అవకాశాలు కల్పించే కంపెనీలు సైతం అభ్యర్థుల సర్టిఫికెట్లు ఒరిజినల్ అవునా? కాదా? అనే అంశాన్ని నేరుగా డిజీ లాకర్‌లోనే పరిశీలించుకునే వెసులుబాటూ ఉంది. గతంలో కంపెనీలు థర్డ్‌పార్టీతో పరిశీలన చేయించేవి.

ప్రొవిజనల్స్‌తో అవసరం లేదు



డీజీ లాకర్ విధానం విజయవంతం కావడం గర్వకారణం. డిజీ లాకర్‌లోని సర్టిఫికెట్లతో ప్రొవిజనల్, ఒరిజినల్ డిగ్రీ (ఓడీ) తీసుకోవచ్చు. కానీ ఎక్కువ మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ తీసుకుని తిరిగి ప్రొవిజనల్‌కు దరఖాస్తు చేస్తున్నారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్ స్వల్ప కాలం వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఒరిజినల్ డిగ్రీ తీసుకున్న వెంటనే ప్రొవిజనల్ డిగ్రీ అవసరం ఉండదు. విద్యార్థులందరూ ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఒరిజినల్ డిగ్రీనే అంతిమం. డిజీ లాకర్‌లో ఇప్పటికే 6.70 లక్షల సర్టిఫికెట్లు అందుబాటులోకి తెచ్చాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ (ఏ)

మార్కెట్ కమిటీల్లో పన్ను వసూళ్లు ఆశాజనకం



అనంతపురం అగ్రికల్చర్: నూతన ఆర్థిక సంవత్సరానికిగాను మొదటి నెలలో పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణ చౌదరి తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 9 మార్కెట్‌కమిటీలకు ఈ ఏడాది రూ.10.81 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా అనంతపురం మార్కెట్‌యార్డుకు రూ.4.10 కోట్లు, తాడిపత్రికి రూ.1.85 కోట్లు, రాయదుర్గానికి రూ.1.20 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా, అత్యల్పంగా గుత్తికి రూ.28 లక్షలు నిర్దేశించినట్లు వివరించారు. మిగిలిన వాటిలో గుంతకల్లుకు రూ.85 లక్షలు, ఉరవకొండకు రూ.76 లక్షలు, శింగనమలకు రూ.75 లక్షలు, కళ్యాణదుర్గానికి రూ.52 లక్షలు, రాప్తాడుకు రూ.50 లక్షలు చొప్పున లక్ష్య నిర్దేశన చేశామన్నారు. ఈ క్రమంలో మొదటి నెల టార్గెట్ రూ.1.02 కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.1.52 కోట్ల వసూలు అయినట్లు తెలిపారు. ఈ లెక్కన ఈ ఏడాది వందశాతానికి మించి వసూళ్లు జరిగేలా విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేస్తామన్నారు. మొదటి నెలలో రాప్తాడు, గుంతకల్లు మినహా మిగిలిన కమిటీల్లో పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. గతేడాది 2022–23లో రూ.10.43 కోట్లకు గానూ 103 శాతంతో రూ.10.74 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు గుర్తు చేశారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



ఉద్యోగ నియామక పత్రాలు పొందిన వారితో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఆర్జేడీ మధుసూదన్, తదితరులు

అనంతపురం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులో చోటు చేసుకున్నాయని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తెలిపారు. అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'ఉద్యోగ విజయోత్సవం' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిప్లొమా పూర్తయిన వెంటనే ఉద్యోగాలు దక్కించుకున్న పలువురు విద్యార్థులను అభినందించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏకంగా 119 మంది విద్యార్థులు ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, మన బడి నాడు–నేడు వంటి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. సర్కారు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి పేద, మధ్య తరగతి వర్గాల వారికి ఉచిత, నాణ్యమైన విద్యను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కంపెనీ అవసరాలకు తగినట్లుగా మానవవనరులను అభివృద్ధి చేసిన పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది కృషిని కొనియాడారు. అనంతపురం ఆర్జేడీ మధుసూదన్ మాట్లాడుతూ... ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను అభినందించారు. అవకాశం చేజారిందంటూ బాధపడకుండా ఆత్మస్థైర్యంతో మరోసారి ప్రయత్నించాలని మిగిలిన విద్యార్థులు సూచించారు. పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి, సప్తగిరి క్యాంపర్ వైస్ ప్రెసిడెంట్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నిశ్చితార్థం చేస్తున్న దృశ్యం (చిత్రంలో) శ్రీవారితో కల్యాణం జరిగే తొమ్మిదేళ్ల బాలిక వైశాలి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. తొలి రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కలశస్థాపన, స్వస్తివాచనము, రక్షాబంధనము నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని శ్రీమార్కండేయస్వామి ఆలయంలో కంకణధారణ జరిగింది. వందేళ్లుగా వస్తున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా ఈ నెల 8న శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీవారితో కల్యాణం జరిగే తొమ్మిదేళ్ల బాలికతో నిశ్చితార్థం (కంకణధారణ) కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీవారి తరపున బ్రాహ్మణులు, పురప్రెలు, దేవదాయశాఖ అధికారులు, వధువు తరపున బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పద్మశాలీయ కులస్తులు హాజరై తాంబులాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ పాలాక్షిరెడ్డి, పద్మశాలియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ, శ్రీవారి సింహవాహనోత్సవం నిర్వహించనున్నారు.

సిగ్గులేకుండా ప్రజాధనాన్ని తిన్నారు

- బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకుంటే బాగుంటుంది
- జేసీ ప్రభాకరరెడ్డిని హెచ్చరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: 'ఇంత కాలం అధికారాన్ని అడ్డుపెట్టుకుని పంది కొక్కుల్లా ప్రజాధనాన్ని తిన్నారు. ఇప్పటికైనా బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకుంటే బాగుంటుంది. లేకపోతే పుట్టగతుల్లేకుండా పోతారు' అంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హెచ్చరించారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు జేసీ ప్రభాకరరెడ్డి పెట్టింది పేరన్నారు. స్థానిక గన్నెవారిపల్లి కాలనీలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై రెండ్రోజుల క్రితం జేసీ ప్రభాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం రాజ్యమేలుతోందని స్పష్టం చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న స్పందన కార్యక్రమంలో లక్షలాది మంది సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం దక్కుతోందన్నారు. ఈ విషయాన్ని జేసీ ప్రభాకరరెడ్డి మరుగున పరుస్తూ అధికారులను అవమానిస్తున్నారని మండిపడ్డారు. తన ఉనికిని చాటుకునేందుకు ఎంతటి వారినైనా బ్లాక్‌మెయిల్ చేయడం జేసీ ప్రభాకరరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇందుకు గత కలెక్టర్ నాగలక్ష్మిని అందరి సమక్షంలో దుర్భాషలాడిన ఘటనే నిదర్శనమన్నారు. అసత్యాలను సత్యాలుగా నమ్మించే ప్రయత్నాలను మానుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ప్రజాధనంతోనే తాడిపత్రి అభివృద్ధి

తాడిపత్రిని తానే అభివృద్ధి చేసినట్లుగా జేసీ ప్రభాకరరెడ్డి గొప్పలకు పోతున్నాడని, అయితే ఇందుకు ఆయన సొంత డబ్బు ఒక్క నయాపైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ప్రజాధనంతోనే అభివృద్ధి సాధ్యమైందని స్పష్టం చేశారు. దివంగత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాడిపత్రి నియోజకవర్గంపై ఆయన చూపిన చొరవనే ఇందుకు కారణమని గుర్తు చేశారు. చాగల్లు డ్యాం, పెండేకల్లు రిజర్వాయర్, తాడిపత్రి నూతన కూరగాయల మార్కెట్, పట్టణంలో వెడల్పాటి సీసీ రోడ్ల నిర్మాణాల కోసం వైఎస్సార్ పెద్ద ఎత్తున నిధులను సమకూర్చినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ రంగనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

చౌకధాన్యపు దుకాణం సీజ్

బొమ్మనహాళ్: రికార్డుల నిర్వహణలో అక్రమాలకు తెరలేపిన చౌకధాన్యపు డిపో డీలర్‌పై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డిపోను సీజ్ చేశారు. వివరాలు.. బొమ్మనహాళ్ మండలం వెంకటాద్రిపల్లిలో సీతారాములు నిర్వహిస్తున్న 18వ నంబర్ చౌకధాన్యపు దుకాణాన్ని బుధవారం ఉదయం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆన్‌లైన్ రికార్డుల్లో 30 క్వింటాళ్ల బియ్యం నిల్వలు ఉండగా... దుకాణంలో 23 క్వింటాళ్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో అధికారులు వివరణ కోరగా డీలర్ పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో డిపోను సీజ్ చేశారు. నిర్వాహకుడిపై 6ఏ కేసు నమోదు చేసి, నిల్వలను వీఆర్వోకు అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ వెంకటరమణ, సీఎస్‌డీటీ ప్రమీల, వీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.

మహా యజ్ఞానికి తరలిరండి

- ఎండోమెంట్ ఏసీ రామాంజనేయులు

అనంతపురం కల్చరల్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా జరిగే అష్టోత్తర శత కుండాత్మక మహాయజ్ఞంలో పాల్గొనాలంటూ జిల్లా వాసులకు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత మహాయజ్ఞ యాగాదులను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం, దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ యజ్ఞదీక్షాధారణ చేస్తారన్నారు. రోజూ ఉదయం హోమాలు, సాయంత్రం రోజుకొక దేవతామూర్తుల కల్యాణోత్సవంతో ఆధ్యాత్మిక పరంపర కొనసాగుతుందన్నారు.

వైభవంగా పట్టపు దేవర



బీరప్ప దేవుళ్లను దర్శించుకుంటున్న భక్తులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జగద్గురు రేవణ సిద్దేశ్వర మహాప్రాంగణంలో రాజగిరి గోత్ర కురబ సోదరుల ఆధ్వర్యంలో బీరప్ప దేవ్ళ పట్టపు దేవర మహోత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. జల కలశాలకు విశేష పూజలు నిర్వహించి, మహాజన సంప్రోక్షణగావించి, గొరవయ్యల అమృతపానోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు మదనమోహన్‌శాస్త్రి, రాంబాబుశాస్త్రి మంత్రోచ్చరణలతో కురుబల ప్రాంతీయ కులగురువు మృత్యుంజయ వడయార్, జాలోడు, బళ్లారి, కర్తనపర్తి, చాబాల వడయార్ల ఆశీర్వచనాలతో మహాసామ్రాజ్య పట్టాభిషేకం, పుణ్యదంపతుల వస్త్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 400 జంటలకు సామూహిక వడిబాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆహ్వానిత బీరప్ప దేవుళ్లకు బండారు సమర్పించారు. అనంతరం తొమ్మిది మంది దేవుళ్లను పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కామక్క కథ నాటికను ప్రదర్శించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి దాదాపు 12 వేల మంది భక్తులు తరలిరావడంతో బొమ్మనహాళ్ జనసంద్రమైంది. భక్తులకు బొమ్మనహాళ్ ఆగలూరేశ్వరస్వామి నిర్వాహక సేవా కమిటీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో కులగురువులతో పాటు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు వై.భీమిరెడ్డి పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడి మృతి

బొమ్మనహాళ్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. డి.హీరేహాళ్ మండలం తిమ్మలాపురం నివాసి కురుబ రాజశేఖర్ (28)కు నాలుగేళ్ల క్రితం బొమ్మనహాళ్ మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన వన్నూరమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సిద్దరాంపురంలో చిన్నమామ గృహప్రవేశం ఉండడంతో భార్యాపిల్లలతో కలసి బుధవారం ఉదయం తన అత్తింటికి రాజశేఖర్ చేరుకున్నాడు. అనంతరం గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు స్నానానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో గట్టున నిలబడి స్నానం చేస్తుండగా అదుపుతప్పి బావిలో పడిపోయాడు. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే బావిలో దూకి వెలికి తీసేలోపు రాజశేఖర్ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోండి

- జిల్లా వైద్యాధికారిని ఆదేశించిన కలెక్టర్ గౌతమి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయిని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో వైద్య సేవలపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్‌ఓతో పాటు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి, ఆరోగ్యశ్రీ అధికారులు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవితో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. నాడు–నేడు కింద 36 పీహెచ్‌సీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆరా తీశారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద పెండింగ్‌లో ఉన్న నిధుల వివరాలు పంపాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనపై అవగాహన కల్పిస్తూ మరింత మందిని ఎన్‌రోల్ చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీపై ఆందోళన వ్యక్తం చేస్తూ మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ అధికారులను సమన్వయ పరుచుకుని కుష్టువ్యాధిగ్రస్తులకు జీవనోపాధి కల్పనపై దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద చికిత్స పొందిన రోగుల స్పందన సేకరణలో వెనుకబడి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి శుక్రవారంలోపు వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆరోగ్య శ్రీ కో–ఆర్డినేటర్‌ను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బరిలో 22 మంది

- తపాలా శాఖ ఎన్నికల్లో ముగిసిన నామినేషన్ల ఘట్టం

అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికల పోరు ప్రతిష్టాత్మకంగా మారింది. కరోనా విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ఐదేళ్ల తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం బుధవారం ముగిసింది. మొత్తం 11 డైరెక్టర్ స్థానాలకు 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారి కుమార్ ప్రకటించారు. వీరి పేరులోని తెలుగు అక్షరమాల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో గుర్తులు కేటాయించారు.

రెగ్యులర్ ఉద్యోగుల స్థానాలకు 18 మంది

మొత్తం 11 స్థానాల్లో తొమ్మిది స్థానాలు(డైరెక్టర్ పోస్టులు) రెగ్యులర్ ఉద్యోగులకు కేటాయించారు. ఈ కోటా కింద 24 మంది నామినేషన్లు దాఖలు చేయగా వారిలో ఆరుగురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. 18 మంది పోటీలో నిలిచారు. వీరిలో ఆర్‌వీ రామ్మోహన్‌గుప్త (బీరువా), ఎ.విశ్వనాథరెడ్డి (గాలి బుడగ), ఎస్‌కే మహేష్ గౌడ్(వంకాయ), అందాల నాగేశ్వర(బకెట్), కావలి పెద్దన్న(బల్ల), కురవ స్టాలిన్ బాబు(బంతి), కె.గణేనాయక్(అరటి పండు), కె.రాఘవేంద్ర ప్రసాద్(బుట్ట), గస్తీ రమేష్‌గౌడ్(బ్యాట్), చిన్నమాదల కిశోర్ కుమార్(బాట్స్‌మెన్), జె.శివకుమార్(బ్యాటరీ లైట్), దేవగుడి కిరణ్‌కుమార్(నల్లబోర్డు), ఎస్‌ఆర్‌కే ప్రసాద్(బ్రెడ్), పెండ్యాల విశ్వనాథ్(పెట్టె), బి.నరేంద్రనాథ్‌రెడ్డి(బ్రష్), బి.నవీన్‌కుమార్(కేక్), బి.మంజునాథ్(కెమెరా), బి.హర్షవర్ధన్ రెడ్డి(కొవ్వొత్తి).ఉన్నారు.

ఆ రెండు స్థానాలకు నలుగురు

బీడీఎస్ ఉద్యోగుల కోసం కేటాయించిన రెండు స్థానాలకు మొత్తం ఆరు నామినేషన్లు దాఖలు కాగా, ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో నిలిచిన నలుగురిలో కె.సూర్యనారాయణరెడ్డికి క్యారెట్ గుర్తు, జె.వెంకటరామిరెడ్డికి కోటు), బి.నాగభూషణంకు కొబ్బరికాయ, మంత్రి ఆనంద్‌కు దువ్వెన గుర్తులు కేటాయించారు.

609 మందికి ఓటు హక్కు

తపాలా శాఖలో పని చేస్తూ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన వారు మొత్తం 792 మంది ఉన్నారు. అయితే వీరిలో 609 మందికి మాత్రమే ఓటు హక్కు ఉంది. మిగిలిన 183 మందిని అనర్హులుగా ప్రకటించినట్లు ఎన్నికల అధికారి కుమార్ తెలిపారు. సొసైటీలో రుణాలు తీసుకొని వరుసగా మూడు కంతులు కట్టని వారిని అనర్హులుగా పరిగణించినట్లు వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయానికి వరుసగా మూడు కంతులు కట్టని వారు సొసైటీ ఎన్నికల్లో పోటీ చేయడానికి, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుండదని నిబంధనలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు 183 మంది అనర్హత వేటు పడింది.

క్లుప్తంగా

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో కురుబ కులస్తులు నూతనంగా నిర్మించిన కుర్లపల్లయ్యస్వామి ఆలయానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. బుధవారం గ్రామంలో జరిగిన ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన విచ్చేసి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ పూజారికి లక్ష రూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకుడు హనుమంతరెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామంలో వెలసిన చిన్న కదిరయ్యస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలో కానుకలను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.10 లక్షల ఆదాయం వచ్చిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో జిల్లాను ముందంజలో నిలపాలి

రాప్తాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జిల్లాను ముందంజలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీడీ అనురాధ పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు పని కల్పించకపోతే సంబంధింత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఏపీఓలు సావిత్రి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు



పేరూరులో సచివాలయ సిబ్బందితో సమావేశమైన డీఎల్‌డీఓ శివారెడ్డి

రామగిరి: రాష్ట్రప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కాగా చేరవేసే బాధ్యత సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై ఉందని డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పేరూరు, దుబ్బార్లపల్లి, నసనకోట, మాదాపురం గ్రామాల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వలంటీర్లు విధులను సక్రమంగా నిర్వహిస్తూ అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆజాద్, జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున నాయకులున్నారు.

హక్కుల సాధనకు పోరాటం




ఏఐవైఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకు ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌టీఆర్ మార్గ్ 80 అడుగుల రోడ్డు వద్ద సంఘం ఆవిర్భావ సభను ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర సమితి సభ్యుడు జమీర్ కేక్ కట్ చేశారు. అంతకు ముందు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాప్తాడురూరల్: ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని అనంతపురం రూరల్ మండలం సదాశివ కాలనీలో ఘనంగా జరుపుకొన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయ, మాజీ ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ హాజరై జెండా ఆవిష్కరించారు. నాయకులు రెడ్డప్ప, వంశీ, మనోజ్ తదితరులున్నారు.

పరామర్శ



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న అధికారులు

రాప్తాడురూరల్: రాచానపల్లిలో ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణరెడ్డి కుటుంబాన్ని బుధవారం అధికారులు పరామర్శించారు. ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, సర్పంచ్ అంజియాదవ్, వీఆర్‌ఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వీహెచ్‌ఏ శివశంకర్ తదితరులు వెళ్లారు. ఆర్థికసాయం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఏఓ తెలిపారు.



కిటకిట: పిల్లలతో సందడిగా మారిన పీటీసీ మైదానం



జాగ్రత్త..: పిల్లలను చూసుకుంటున్న కుటుంబీకులు

సెలవుల కాలం.. ఆటలే లోకం..



బాల్ నాది..: రగ్బీ తరహా క్రీడా పోటీలో బంతి కోసం పిల్లల పోటీ

వేసవి సెలవులు మొదలవడంతో పిల్లల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఉదయం, సాయంత్రం వేళలో ఎక్కువ సేపు పార్కులు, మైదానాల్లో సందడి చేస్తున్నారు. తల్లిదండ్రులు సైతం మానసికోల్లాసం కోసం వారిని మైదానాలకు తీసుకువస్తున్నారు. పిల్లలు, తల్లిదండ్రులతో మైదానాలు కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని పీటీసీ నిత్యం సందడిగా మారుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కొడితే ఫోర్: క్రికెట్ ఆడుతున్న చిన్నారి

శాస్త్రోక్తంగా ధర్మోపనయనాలు



ధర్మోపనయనాల్లో పాల్గొన్న బ్రాహ్మణ వటువులు

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండరామాలయంలో బుధవారం ఉదయం ఉచిత ఉపనయనాలు, బ్రహ్మోపదేశం, యజ్ఞోపవిత ధారణ తదితర అంశాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయంలో కొలువు దీరిన ఆదిశంకర భగవత్పాదులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ప్రతినిధులు సాయి శివరాం, రఘురామారావు మాట్లాడుతూ మౌఢ్యమి కారణంగా శంకరజయంతి నాడు జరగాల్సిన సామూహిక ధర్మోపనయనాలు శృంగేరీ పీఠాధిపతుల ఆదేశంతో బుధవారం నిర్వహించామని తెలిపారు. 22 మంది వటువులకు ఉపనయనాలు, 800 మంది బ్రాహ్మణులకు అన్నప్రసాద వితరణ జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపనయన సేవా సంఘం సభ్యులు సత్య ప్రసాద్, మధుసూదన్, రవికుమార్, విశ్రాంత ఈఓ నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు జగనన్న



లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న అందరివాడు అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని దండోరాకాలనీ, ఆదర్శనగర్‌లో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని మహిళలను అడిగారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతోందని మహిళలు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు దోచుకున్నారన్నారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. అందరి మేలు కోరుతున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ తేజశ్విణి, ఎంపీటీసీ సభ్యులు గాయత్రిదేవి, వడ్డే శీనా, నాయకులు ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్, యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, పంచాయతీ వార్డు మెంబర్లు ఫర్జానా, రామస్వామి, రామలక్ష్మీ, అన్ను, స్థానిక నాయకులు రమేష్, సూరి, సాయిరామ్, కృష్ణ, నవీన్, మంజు, సొహైల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీర ఓబమ్మజాతర



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సీఐ చిన్నగౌస్

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లిలో యాదవ కులస్తుల గ్రామ దేవత వీరఓబమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలో రాతిదూలం లాగుడు పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. సీఐ చిన్నగౌస్ పోటీలను ప్రారంభించగా మొత్తం 8 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వీరిలో తోపుదుర్తి చెన్నప్పకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. గంగవరం గురుయాదవ్, గార్లదిన్నె పరమేష్ ఎద్దులు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దన్న ఎంపీటీసీ రామ్మోహన్‌తో పాటు కులపెద్దలు గోపాలప్ప, ఆదినారాయణ, శివ, కేశవప్ప, రాజప్ప, మురళి, గంగప్ప, తిప్పన్న, గోపాల్ పాల్గొన్నారు.

సందడిగా రాతిదూలం పోటీలు

ఆత్మకూరు: అక్కమ్మగార్ల పరుష సందర్భంగా ఆత్మకూరులో బుధవారం అక్కమ్మగార్ల ఆలయం వద్ద రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. దేశపు ఎద్దుల విభాగానికి సంబంధించిన ఈ పోటీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా జరిగాయి. ప్రథమ స్థానంలో నిలిచిన వృషభాలకు సద్దికూటి శివారెడ్డి,సద్దికూటి తిమ్మారెడ్డి రూ.30 వేలు అందచేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వృషభాలకు కనికిరెడ్డి కొండారెడ్డి బ్రదర్స్ రూ.20 వేలు అందజేశారు. వరుసగా 8 స్థానాల్లో విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందించారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ వద్దు

అనంతపురం అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే చర్యలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తపోవనం సర్కిల్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. పోలీసులు నాయకులను అరెస్టు చేశారు. అంతకు ముందు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సీఐటీయూ ప్రకాశ్‌రెడ్డి, ప్రసాద్, నాగరాజు, పరమేష్, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున, కృష్ణుడు, శ్రీనివాసులు, హరికృష్ణ, లింగమయ్య, తదితరులున్నారు.

అభివృద్ధి చేసి చూపించాం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తామని మాటిచ్చాం. మాట ప్రకారం ప్రజలు ఊహించని విధంగా నగరాభివృద్ధి చేసి చూపాం' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 14,15 డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లు అబూసలేహ, గూడురు మల్లికార్జునతో కలసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.58 కోట్లతో తడకలేరు నుంచి గుత్తి రోడ్డు వరకు రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. రూ.312 కోట్లతో బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు ఫోర్‌వే బ్రిడ్జ్ (9.1 కిలోమీటర్ల) పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు సీఎం జగన్ చొరవతో నగరంలో 36 డివిజన్లు కవరయ్యేలా రూ.25 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించామన్నారు.

పరిష్కారం చూపాలి..

కమలానగర్‌లో స్థానికులు బాలమ్మ, వెంకటలక్ష్మి, షమీమ్ తదితరులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వారికి సంక్షేమం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఓ డాక్టర్ దామోదర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది ఊహ, గాయిత్రి తదితరులను ఎమ్మెల్యే ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్‌లను కాలువలపై వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాను ఆదేశించారు. చెత్త సేకరణలో జాప్యం జరుగుతోందని విమల అనే మహిళ విన్నవించగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించేలా చూడాలని జయమ్మ, వరలక్ష్మి అనే మహిళలు వేర్వేరుగా ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, డైరెక్టర్లు గౌస్‌బేగ్, శ్రీనివాసులు, జాహ్నవిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, ఎగ్గుల శ్రీనివాసులు, సైఫుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే అనంత పేర్కొన్నారు. 29, 40, 42వ డివిజన్‌లో పూర్తి చేసిన ప్రజామద్దతు పుస్తకాలను ఎమ్మెల్యే నివాసం ఆవరణలో ఎమ్మెల్యేకు గృహసారథులు, నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కేడర్‌కు అభినందనలు తెలిపారు.

అంతా మా ఇష్టం



ఉదయం 11 గంటలైనా ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ కుర్చీ



ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయ సిబ్బంది కుర్చీలు

అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ సిబ్బంది అంతా తమ ఇష్టం అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి. పని నిమిత్తం డీడీ విజయవాడకు వెళ్లగా బుధవారం చాలా మంది సిబ్బంది ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాలేదు. సీనియర్ అసిస్టెంట్‌తోపాటు ఒకరిద్దరు తప్ప మిగిలిన వారెవరూ రాకపోవడంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు వెనుదిరగాల్సి వచ్చింది. డీడీ లేని సమయంలో కార్యాలయాన్ని పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ సైతం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

14న ఎన్ఆర్ఐ టాలెంట్ హంట్

రాప్తాడురూరల్: ఇంటర్‌లో ఉచిత ప్రవేశాలకు అనంతపురం నగరంలోని ఎన్ఆర్ఐ విద్యా సంస్థలు నిర్వహిస్తున్న టాలెంట్ హంట్-2023 పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విడుదల చేశారు. పరీక్షలో 1 నుంచి 10 ర్యాంకుల్లో నిలిచిన విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన విద్యనందించనున్నారు. ఎన్ఆర్ఐ విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14న టాలెంట్ హంట్ -2023 పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. సందేహాలకు 94944 72722, 96523 80088 నంబర్లలో సంప్రదించాలన్నారు.

8 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఆత్మకూరు: ఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 8వ తేదీ నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో పాల్గొనే 15 మంది క్రీడాకారులు ఒకే గ్రామానికి చెందిన వారై ఓ టీమ్‌గా ఉండాలన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడు, నాల్గవ బహుమతిగా ట్రోఫీలను అందజేస్తామని ప్రకటించారు. 9052796786, 6300171445లో సంప్రదించాలని కోరారు.

రేపు ఆత్మకూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు

ఆత్మకూరు: వైఎస్సార్ ఆసరా మూడవ విడతకు సంబంధించి ఈ నెల 5న ఆత్మకూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా సంఘం మహిళలు తప్పక హాజరుకావాలని సూచించారు.

వైభవంగా అక్కమ్మగార్ల పరుష

ఆత్మకూరు: మండల కేంద్రం దేవల తోటలో వెలసిన తిరుగడ అక్కమ్మ గార్ల పరుష బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అక్కమ్మ దేవతలను దర్శించుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లను తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులు అన్నదానం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో కుర్లపల్లప్పయ్యస్వామి విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయం వద్ద గంగ పూజ, గోపూజ, గణపతి పూజ, బలిహరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శరత్ కుమార్, వేదపండితులచే నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నమో నారసింహా

- లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవానికి ముస్తాబు
- జిల్లా కేంద్రంలో ఏకైక నరసింహాలయం



నగరంలో వెలసిన నృసింహాలయం, కొలువైన స్వామివారు



అనంతపురం కల్చరల్: అనంత జిల్లా రాష్ట్రంలోనే నరసింహస్వామి దేవాలయాలకు ఎంతో ప్రసిద్ధి చెందినదన్న పురాణ నేపథ్యముంది. అందులో భాగంగానే నగరంలోనూ ఏకైక నరసింహస్వామి కొలువుదీరి పూజలందుకుంటున్నాడు. నగరం ఏర్పడిన తొలిరోజుల్లో నిర్మాణమైన ఈ ఆలయంలో శనివారం నరసింహ జయంతి కనుల పండువగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలపై అధికారుల సమక్షంలో అవగాహన సదస్సు జరగనుంది.

ఆలయ చరిత్ర..

నగరం ఏర్పడుతున్న రోజుల్లో శివకేశవ ఆలయాలను పోటీ పడి ఆనాటి రాజులు నిర్మించారు. అయితే చాలా ఏళ్ల వరకు అన్ని దేవతామూర్తులకు ఆలయాలున్నా నరసింహస్వామి కంటూ ప్రత్యేక ఆలయం ఉండేది కాదు. పాతూరు వీధుల్లో కొలువైన చిన్నాంజనేయస్వామి గుడిలోనే చిత్రపటం ఉంచి పూజలు జరిపించేవారు. వందల సంవత్సరాల చరిత్ర కల్గిన ఈ ఆలయాన్ని 1998లో ఎండోమెంట్ నుంచి తప్పించి వివిధ మఠాల సహకారం, భక్తుల కమిటీలతో ఆలయ ప్రాంగణంలో నూతన విగ్రహ ప్రతిష్టలు జరిగాయి. ఇదే సుందర ప్రాంగణంలో ప్రహ్లాద ప్రతిరూపమైన ఆంజనేయస్వామితో పాటు రాఘవేంద్ర స్వామి బృందావనం, వేణుగోపాల స్వామి, వ్యాసరాయలు, మహేశ్వరుడు, నవగ్రహాలు నిత్యపూజలందుకుంటున్నాయి. ముఖ్యంగా నరసింహస్వామి వెలసిన తర్వాత ప్రతి ఏటా నరసింహస్వామి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు కల్యాణోత్సవం..

వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి అభిషేక, అలంకార సేవలు అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరుగుతుంది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవ వేడుకలు జరగనున్నాయి. భక్తులందరూ పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ప్రతినిధి రఘునాథాచార్ కోరారు

పథకాలపై అవగాహన..

నరసింహస్వామి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎండోమెంటు ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా కల్యాణోత్సవంలో పాల్గొంటారు. వీరి సమక్షంలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న ప్రత్యేక పథకాలపై అవగాహన కల్పిస్తారు. సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.